క్లుప్తంగా

స్క్రాప్ విక్రయానికి టెండర్ల ఆహ్వానం

న్యూశాయంపేట : నగరంలోని పెద్దమ్మగడ్డలోని తెలంగాణ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో స్క్రాప్ (పాత ఐరన్, ప్లాస్టిక్, స్టీల్, పాత టెక్ట్స్, నోట్‌బుక్స్) విక్రయించేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జంగా సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల పాత ఇనుపసామాన్ల వ్యాపారులు ఈనెల 15న సాయంత్రం 5 గంటలలోపు తమ టెండర్లు దాఖలు చేయాలని వివరించారు. పూర్తి వివరాలకు 99493 63106 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

నయీంనగర్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మాస్టర్‌జీ విద్యా సంస్థల చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. మంగళవారం కిషన్‌పుర మాస్టర్ జీ హై స్కూల్‌లో విద్యార్థి నేతల ప్రమాణస్వీకారోత్సవం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో డైరెక్టర్ ఆశాజ్యోతి, ప్రిన్సిపాల్ రజిత, వైస్ ప్రిన్సిపాల్ రాధిక, ఏఓ చత్రపాల్ సింగ్, సరళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి, ప్రధానికి పోస్టు కార్డుల ద్వారా శుభాకాంక్షలు



హన్మకొండ: మండలంలోని పలివేల్పుల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు జాతీయ, రాష్ట్ర ప్రముఖులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులందరూ రాష్ట్రపతి, ప్రధాని, రాష్ట్ర గవర్నర్, సీఎం, జిల్లా కలెక్టర్‌కు పోస్టుకార్డు ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వారికి పోస్టుకార్డులు పంపారు. ఉపాధ్యాయుడు వెనిశెట్టి రవికుమార్ మాట్లాడుతూ జాతీయ పండుగల ప్రాధాన్యతను తెలుపడంతో పాటు ప్రముఖులను గౌరవించడంపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహిళల రక్షణ కోసమే సఖి కేంద్రం

కాజీపేట: మహిళలపై గృహహింస, లైంగిక వేధింపులు, అత్యాచారాలు పనిచేసే చోట వేధింపుల నుంచి రక్షణ కల్పించడానికి సఖి కేంద్రం అంకితభావంతో పని చేస్తుందని కేస్ వర్కర్ వినీలా అన్నారు. 61వ డివిజన్ వెంకటాద్రినగర్ కాలనీలో మంగళవారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో మహిళల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

తీజ్ ఉత్సవాలు ప్రారంభం

హసన్‌పర్తి: నగరంలోని 56వ డివిజన్ గోపాలపురంలో తీజ్ ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 13 నుంచి 22వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

కరపత్రాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

తీజ్ ఉత్సవ కరపత్రాన్ని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు ఆవిష్కరించారు. నిర్వాహకులు జవహర్‌లాల్ నా యక్, రాంచందర్‌నాయక్, రాజారాంనాయక్, రామెల్ నాయక్, కృష్ణానాయక్, రాజు నాయక్, సర్వాన్ నాయక్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే దేవాలయ సముదాయంలోని శ్రీవీరాంజనేస్వామి ఆలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ మంగళవారం దాతల సహకారంతో 108 మందికి తక్కువ కాకుండా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. కమిటీ సెక్రటరీ పి.భాస్కర్‌రావు, పి.పరశురాములు, ఎన్.భాస్కర్, ప్రసాదరావు, అర్చకులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనుల్లో వేగం పెంచండి



నయీంనగర్: నిర్దీత సమయానికి నయీంనగర్ బ్రిడ్జి అందుబాటులోకి వచ్చేలా తుది దశ నిర్మాణ పనులు వేగంగా పూర్తిచేయాలని వరంగల్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి నయీంనగర్ నాలా, బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు.సైడ్ కాల్వ పనులు, బ్రిడ్జికి ఇరువైపుల సుందరీకరణ పనులు సమపాలుగా చేయాలన్నారు. తాత్కాలిక ప్రజా రవాణాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట కార్పొరేటర్లు అబూబాకర్, విజయశ్రీ సయ్యద్ రజాలీ, ఎస్‌ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ రాజయ్య, డీఈ హర్షవర్ధన్, అధికారులు ఉన్నారు.

ఐక్యత పెంచేందుకే 'హర్ ఘర్ తిరంగా'

వరంగల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజల్లో ఐక్యత, సమగ్రతను పెంపొందించడానికే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టినట్లు బీజేపీ వరంగల్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కాసు శిల్ప అన్నారు. మంగళవారం పోచమ్మమైదాన్ జంక్షన్‌లో హర్ ఘర్ తిరంగా జెండా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారిని స్మరించుకునేందుకు, ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడానికి, కాంగ్రెస్ తప్పులను బహిర్గతం చేస్తూ బీజేపీ 'హర్ ఘర్ తిరంగా' ప్రచారాన్ని ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, కార్పొరేటర్ గందె కల్పన, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్, ఎ.భరత్ వీర్, మార్టిన్ లూథర్, గోకె వెంకటేశ్, బైరి శ్యామ్, బండి సుజాత, మహిళా నాయకురాలు, డివిజన్ అధ్యక్షులు మహిళలు పాల్గొన్నారు.



వరంగల్: పోచమ్మమైదాన్‌లో హర్ ఘర్ తిరంగా జెండా ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

హర్ ఘర్ తిరంగా ప్రదర్శన

హసన్‌పర్తి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకని హర్ ఘర్ తిరంగా ప్రదర్శన నిర్వహించారు. మండల కేంద్రంలో కార్పొరేటర్ శివకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ గీతాన్ని ఆలపించారు. శివకుమార్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తమతమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాళ్లపల్లి కుమారస్వామి, చకిలం రాజేశ్వర్‌రావు, పిట్టల కుమారస్వామి, మారపల్లి రాంచెంద్రారెడ్డి, హరిశంకర్, పెద్దమ్మ శ్రీనివాస్, పెద్దమ్మ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పర్తి: ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

ఎమ్మెల్యే 'నాయిని'ని కలిసిన టీఎన్జీఓస్ నేతలు

హన్మకొండ అర్బన్ : ఆస్ట్రేలియా పర్యటన ముగించుకొని నగరానికి చేరుకున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని హనుమకొండ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఉద్యోగులంతా సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని కోరారు. కలిసిన వారిలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కేంద్ర సంఘం నాయకులు శ్యామ్‌సుందర్, సారంగపాణి, లక్ష్మీప్రసాద్, జిల్లా నాయకులు రాజమౌళి, సురేష్, రాంప్రసాద్, రాజేష్‌ఖన్నా, రాజేశ్వర్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, రమేష్, పవన్ కుమార్, తదితరులు ఉన్నారు.



హన్మకొండ అర్బన్: ఎమ్మెల్యే నాయినికి పుష్పగుచ్ఛం అందిస్తున్న టీఎన్జీఓస్ నాయకులు

కాజీపేట రూరల్ : నగరంలోని 47వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని మంగళవారం క్యాంప్ కార్యాలయంలో కలిశారు. విదేశీ పర్యటన ముగించుకొని వచ్చిన ఎమ్మెల్యేను నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కలిసిన వారిలో నాయకులు సిరిల్‌లారెన్స్, ఇప్ప శ్రీకాంత్, దొంగల కుమార్, శ్రీనివాస్, రమేష్, నాగేశ్వర్‌రావు, స్వామి, రాజ్‌కుమార్ ఉన్నారు.

పనుల్లో వేగం పెంచండి



వరంగల్ అర్బన్ : ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పనుల్లో వేగం పెంచాలని బల్దియా మేయర్ గుండు సుధారాణి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బల్దియా పోతననగర్‌లో ఏర్పాటు చేసిన సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ సివిల్ పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు తగు సూచనలు చేశారు. ఎస్‌ఈలు ప్రవీణ్, చంద్ర రాజయ్య, ఈఈ శ్రీనివాస్, స్మార్ట్ సిటీ సిబ్బంది ఉన్నారు.

క్రైం కార్నర్

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

కాశిబుగ్గ : గూడ్స్ రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్–చింతలపల్లి రైల్వే స్టేషన్ల మధ్య ధర్మారం శ్మశాన వాటిక సమీపంలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది.



ఎల్లయ్య(ఫైల్)

జీఆర్పీ సీఐ నరేశ్ కథనం ప్రకారం.. సంగెం మండలం పల్లారుగూడకు చెందిన పోడేటి ఎల్లయ్య(52) మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య పూలమ్మ, కుమార్తె మేఘన, కుమారుడు రక్షిత్ ఉన్నారు. మేస్త్రీ పనికి వెళ్లే ఎల్లయ్య ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఇంట్లో నుంచి బయటకు వచ్చి ధర్మారం శ్మశాన వాటిక ఎదురుగా ఉన్న రైల్వేట్రాక్‌పై డౌన్‌లో వెళ్తున్న గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో తల పగిలి అక్కడికక్కడే పడి చనిపోయాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి.రాజు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని సీఐ తెలిపారు.

వాహనాల స్క్రాప్ విక్రయించే నిందితుల అరెస్ట్

రామన్నపేట : వాహనాలను తక్కువ ధరలకు కొనుగోలు చేసి బ్యాంకు ఈఎంఐలు చెల్లిస్తామని పేర్కొంటూ ఆ వాహనాలను స్క్రాప్ ద్వారా విక్రయించి యాజమానులను మోసం చేస్తున్న కేసులో ఇద్దరిని అరెస్టు చేయగా తప్పించుకుని తిరుగుతున్న సురేష్‌గౌడ్, ఫైనాన్సర్ అఖిల్‌లను మంగళవారం అరెస్టు చేసినట్లు మట్టెవాడ సీఐ గోపి తెలిపారు. ఈ కేసులో గతంలో వరికొప్పుల దశరథం, దుర్గం సదన్‌లను బాధితుడు సంపల్లి శ్రీనివాస్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరెస్టు చేసినట్లు తెలిపారు. శ్రీనివాస్‌రావు దగ్గర నుంచి రూ.24 లక్షల విలువ చేసే కారును కొనుగోలు చేసి రూ.3 లక్షలు ఇచ్చి మిగతా డబ్బులు ఇవ్వకుండా ఈఎంఐలు కట్టకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా కొనుగోలు చేసిన వాహనాలను స్క్రాప్ ద్వారా విక్రయిస్తూ బ్యాంకులకు ఎగనామం పెట్టడంతో పాటు యాజమానులకు డబ్బులు చెల్లించకుండా మోసం చేస్తున్నట్లు గుర్తించి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రైతుపై ఎద్దు దాడి

ఖిలా వరంగల్: పంట పొలం దమ్ము చేస్తున్న ఓ రైతుపై ఎద్దు దాడి చేయడంతో తీవ్రగాయాలైన సంఘటన మంగళవారం మండలంలోని గుంటూరుపల్లిలో చోటు చేసుకుంది. గుంటూరుపల్లికి చెందిన రైతు చెల్పూరి వీరస్వామి మంగళవారం ఉదయాన్నే వరి పొలం దున్నేందుకు వెళ్లాడు. పొలం దున్నుతున్న వీరస్వామిపై ఎద్దు ఎదురు తిరిగి కొమ్ముతో పొడవడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానిక రైతులు క్షతగాత్రుడిని వెంటనే 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మామునూరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

- వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ
- వాహనదారులకు కౌన్సెలింగ్


వరంగల్ క్రైం: కుటుంబ భవిష్యత్ బాగుండాలంటే మద్యం సేవించి వాహనాలు నడపొద్దని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ సూచించారు. ట్రై సిటీ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులకు పట్టుబడిన వాహనదారులకు కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్య ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై వాహనదారులు, వారితో వచ్చిన వారి కుటుంబీకులతో మాట్లాడారు. ఇటీవల మద్యం సేవించి రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారిలో అధికంగా నిరుపేద కుటుంబాలకు చెందిన వారే ఉన్నారన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల్లో అవయవాలు కోల్పోతున్న వారి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని పేర్కొన్నారు. ఈ సంవత్సరం ట్రై సిటీ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు సంబంధించి మొత్తం 5,410 నమోదవడంతో పాటు 60 మంది వాహనదారులకు ఒకటి లేదా రెండు రోజుల పాటు జైలు శిక్షలు విధించినట్లు తెలిపారు. మరో 5,095 మంది వాహనదారులకు జరిమానాలు చెల్లించారని పేర్కొన్నారు. ఇకపై వాహనదారుడు మద్యం సేవించి వాహనం నడపడాన్ని కుటుంబ సభ్యులే వ్యతిరేకించాలని కోరారు. ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ సత్యనారాయణ

'మల్లికాంబ'లో దుస్తుల పంపిణీ

హన్మకొండ అర్బన్ : అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో కేయూ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితారెడ్డి మంగళవారం బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో మానసిక దివ్యాంగులైన పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవ అని అన్నారు. దివ్యాంగులను హేళన చేసి ఇబ్బంది పెడితే చట్టప్రకారం శిక్షార్హులవుతారని అన్నారు. ప్రేమ, ఆప్యాయతలు పంచితే వారు కూడా అందరితో కలిసిపోయి అభివృద్ధి చెందుతారన్నారు. కార్యక్రమంలో మల్లికాంబ నిర్వాహకురాలు బండా రామలీల, కళ్యాణ్, ఉపాధ్యాయులు, పిల్లలు, సిబ్బంది పాల్గొన్నారు.



పిల్లలకు దుస్తులు పంపిణీ చేస్తున్న అనితారెడ్డి

శ్రమదానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్లు మంగళవారం క్యాంపస్‌లో శ్రమదానం చేశారు. క్యాంపస్‌లోని రెండు గేట్ల పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రం చేశారు. ఒకేషనల్ కళాశాల వలంటీర్లు, భీమారంలోని శివానీ మహిళా డిగ్రీ కాలేజి వలంటీర్లు, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు లబ్ధి

- ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

మడికొండ: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే పేద ప్రజలకు లబ్ధి చేకూరుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం కాజీపేట మండల పరిధిలోని 44, 45, 46, 64వ డివిజన్లకు చెందిన సుమారు 45 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే, వరంగల్ ఎంపీ కడియం కావ్యతో కలిసి అందజేశారు. అనంతరం మడికొండలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో కాజీపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘు చందర్, స్థానిక నాయకులు, బైరి లింగమూర్తి, బిల్ల రవీందర్, అమర్‌నాథ్, నీలం వేణు, రజినియాదవ్, కుర్ల మోహన్, వస్కుల శంకర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, ఎంపీ కావ్య

ఐటీఐ నూతన భవనాన్ని నిర్మించాలి

వరంగల్ : వరంగల్ ములుగురోడ్‌లోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) శిథిలావస్థలో ఉన్నందున నూతన భవన నిర్మాణాన్ని వెంటనే నిర్మించాలని డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ శ్రవణ్ అన్నారు. మంగళవారం డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ ఐటీఐ కళాశాలను సందర్శించిన అనంతరం వారు మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థులకు ఉపాధిని కల్పించిన ఈ కళాశాల భవనం నేడు శిథిలావస్థకు చేరుకుందన్నారు. కళాశాల భవంతి పూర్తిగా పెచ్చులు ఊడిపోతూ ఏ క్షణాన ఏమి జరుగుతుందో అనే ఆందోళనలో విద్యార్థులు ఉన్నారు. అధ్యాపకులు భయాందోళనల మధ్య తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆధీనంలో నూతనంగా ఏర్పాటు చేయబో యే స్కిల్ యూనివర్సిటీని ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తూ, విద్యార్థులను కార్పొరేట్, పెట్టుబడి దారి సంస్థలకు బానిసలుగా చేస్తూ విద్యార్థులను శ్రమదోపిడీకి గురిచేస్తున్నాయన్నా రు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కన్వీనర్ శివ, డీఎస్ఏ జిల్లా నాయకులు చరణ్, నాగరాజు, నరేష్, విజయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్ఏ నాయకులు

గుణాత్మక విద్య అందించాలి

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ డీఈఓ శ్రీనివాస్ విద్యాశాఖ అధికారులకు సూచించారు. మంగళవారం నగరంలోని డైట్ కళాశాలలో ఎంఈఓలు, మండల నోడల్ అధికారులు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గుణాత్మక విద్య అమలులో వివిధ స్థాయిల్లో విద్యాధికారులు నిర్విరామంగా కృషి చేయాలన్నారు. ఫౌండేషన్ లిట్రసీ అండ్ న్యూమరసీ నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం అమలులో ఉపాధ్యాయులను పోత్సహించాలన్నారు. ఎన్ఏఎస్ శిక్షణ లోని విషయాలను ఉపాధ్యాయులు తరగతి గదిలో ఎలా అమలు చేస్తున్నారో అధికారులు పరిశీలించాలన్నారు. రామకృష్ణరాజు, రవీందర్, రమాదేవి, వెంకటేశ్వరరావు, బి.రామ్‌ధన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ డీఈఓ శ్రీనివాస్

సంక్షిప్త సమాచారం

టెక్స్‌టైల్ పార్కులో వసతులు కల్పించాలి

వరంగల్ : మడికొండలోని కాకతీయ టెక్స్‌టైల్స్ పార్కులో మౌళిక వసతులు కల్పించాలని టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం టెక్స్‌టైల్స్ పార్కులో జరిగిన ప్రోగ్రాంలో భాగంగా ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ప్రారంభించబడ్డ ఈ టెక్స్‌టైల్స్ కేవలం 164 యూనిట్లు మాత్రమే ప్రొడక్షన్ చేస్తున్నాయని, వాటికి సంపూర్ణంగా ప్రభుత్వం ద్వారా సబ్సిడీ, విద్యుత్ సబ్సిడీ అందించనందున యజమానులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

మానవత్వం చాటిన డ్రైవర్‌కు సన్మానం



హన్మకొండ: విధి నిర్వహణలో మానవత్వం చాటి ప్రయాణికుడి ప్రాణాలు కాపాడిన ఆర్టీసీ వరంగల్–2 డిపో డ్రైవర్ బి.వెంకన్నను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ.సజ్జనార్ సన్మానించారు. ఈనెల 12న వరంగల్–2 డిపో డీలక్స్ బస్ హైదరాబాద్ నుంచి ఉప్పల్‌కు వస్తున్న క్రమంలో బస్సులోని ప్రయాణికుడికి ఫిట్స్ వచ్చింది. దీంతో పాటు నోటి నుంచి నురగ వచ్చింది. గమనించిన డ్రైవర్ వెంకన్న మార్గమధ్యలో ఆస్పత్రులు లేవని గ్రహించి బీబీనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఆస్పత్రిలో చేర్పించి తిరిగి విధుల్లో భాగంగా ప్రయాణికులతో కలిసి వరంగల్‌కు చేరుకున్నాడు. సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రయాణికుడి ప్రాణాలు కాపాడిన డ్రైవర్‌ను ఆర్టీసీ ఎండీ వీసీ.సజ్జనార్ ప్రశంసించారు. మంగళవారం హైదరాబాద్ బస్ భవన్‌కు పిలిపించుకుని శాలువా కప్పి, జ్ఞాపికను అందించి ఘనంగా సన్మానించారు.

తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెల్లోస్‌గా కేయూ అధ్యాపకులు

కేయూ క్యాంపస్ : హైదరాబాద్‌లోని తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెల్లోస్‌గా కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విభాగాల అధ్యాపకులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో ఫిజిక్స్ విభాగం ఆచార్యులు బి. వెంకట్రామ్‌రెడ్డి, కెమిస్ట్రీ విభాగం టి.సవితాజ్యోత్స్న, ఫార్మసీ కళాశాల ఎన్.ప్రసాద్, బాటనీ ఎన్.రామ్‌రెడ్డి, బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శాస్త్రి ఉన్నారు. అసోసియేట్స్ ఫెల్లోస్‌గా పలువురు ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎస్‌జీఆర్ఐలో నిర్వహించిన తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సమావేశంలో ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌కుమార్, తెలంగాణ ఆఫ్ సైన్సెస్ డైరెక్టర్ సీహెచ్. మో హన్‌రావు, సెక్రటరీ ప్రొఫెసర్ సత్యనారాయణ. జాయింట్ సెక్రటరీ వడ్డె రవీందర్‌లు పత్రాలు అందజేశారు.

ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి

మామునూరు: మారుతున్న వాతావరణం పరిస్థితులతో పాటు అత్యంత వేగంగా మానవ జీవనశైలిలో చోటు చేసుకుంటున్న మార్పులతో కొత్త వ్యాధులు పుట్టుకొస్తున్నాయని, ప్రతీ ఒక్కరు అప్రమత్తమై ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనివ్వాలని వాగ్దేవి విద్యాసంస్థల డైరెక్టర్ చందుపట్ల వాణిదేవీ సూచించారు. మంగళవారం వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్ జి.కమల్ యాదవ్, జయముఖి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో వరంగల్ మెడికవర్ హాస్పిటల్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.

మెట్టుగుట్టపై రాజశ్యామల యాగం

మడికొండ: మడికొండలోని మెట్టురామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కేపీవీ ఏఎస్‌ఎస్ ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యాన్నదాన సత్రంలో ధర్మకర్త మాడిశెట్టి జ్ఞానేశ్వరీ–రాజేశ్‌కుమార్ దంపతులు మంగళవారం రాజశ్యామల యాగం నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని యాగం నిర్వహించినట్లు తెలిపారు.

బీవీపీ ఆధ్వర్యంలో బృంద గీతాల పోటీలు

విద్యారణ్యపురి: భారత్ వికాస్ పరిషత్ హనుమకొండ జిల్లాశాఖ ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఈనెల 31న బృందగీతాల పోటీలను నిర్వహించనున్నట్లు బీవీపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుధీర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలి పారు. బృంద గీతాల కన్వీనర్ కమలామనోహర్ 94406 04347 సెల్ నంబర్‌కు తమ వివరాలు పంపాలని వారు కోరారు.

లక్ష మల్లెలతో అంజన్నకు అలంకరణ

కాజీపేట: 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలో కొలువుదీరిన దక్షిణముఖ అభయాంజనేయస్వామికి మంగళవారం లక్ష మల్లెపూలతో ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు జాగర్లపూడి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో నిత్య పూజలు జరిపించారు.

అభయాంజనేయస్వామి ప్రత్యేక పూజలు

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట విశ్వనాథ కాలనీలోని శ్రీఅభయాంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి గంగు సతీష్ శర్మ , ఆలయ చైర్మన్ కర్నె రవీందర్ ఆధ్వర్యంలో అభయాంజనేయస్వామికి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఇన్‌చార్జ్ డీఈఓను కలిసిన విద్యావారధి ప్రతినిధులు

విద్యారణ్యపురి : హనుమకొండ ఇన్‌చార్జ్ డీఈఓగా విధులు నిర్వర్తిస్తున్న జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ కె.శ్రీనివాస్‌ను మంగళవారం విద్యావారధి స్వచ్ఛంద సంస్థల జిల్లా అధ్యక్షుడు భీమళ్ల సారయ్య, ఇతర ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి పేద విద్యార్థుల ఉన్నతికి పలు రకాల సేవ చేయటం అభినందనీయమన్నారు. కలిసిన వారిలో విద్యావారధి సంస్థ ప్రతినిధులు మధుకర్, మహేందర్‌రెడ్డి ఉన్నారు.

అక్షితారెడ్డికి ప్రశంస పురస్కారం అందజేత



కాజీపేట: నగరంలోని 63వ డివిజన్ సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఒలంపియా డ్ పాఠశాలకు చెందిన విద్యార్థిని అక్షితారెడ్డి అయోధ్య రామమందిరంలో మంగళవారం ప్రశంస పురస్కారం అందుకుంది. ఈ చిన్నారి ఆలయ క్యాంపస్‌లో శాస్త్రీయ నృత్యాన్ని ప్రదర్శించే అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది. ఆలయ బ్రాహ్మణోత్తంలచే బహుమతిని అందుకుంది. పాఠశాల నృత్య ఉపాధ్యాయురాలు కళాశారదతో పాటు అక్షితారెడ్డిని విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, పాఠశాల డైరెక్టర్లు తాళ్ల వంశీ, చైతన్య, అప్లాలున్నీసా, సిబ్బంది అభినందించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత



ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో పో గొట్టుకున్న 19 సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆచూకీ కనిపెట్టారు. స్టేషన్‌లో మంగళవారం ఏసీపీ నందిరాంనాయక్ చేతుల మీదుగా బాధితులకు మొబైల్స్ అప్పగించారు. అనంతరం విధుల పట్ల అంకిత భావంతో పనిచేసిన టెక్ టీం సిబ్బందిని, సీసీఎస్ అధికారులను ఏసీపీ అభినందించారు. కార్యక్రమంలో సీఐ మల్లయ్య, బాధితులు పాల్గొన్నారు

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

ఖిలా వరంగల్: వరంగల్ 43వ డివిజన్ శ్రీసత్యసాయినగర్‌లో వీధిదీపాలు వెలుగక అంధకారం నెలకొంది. గత 20 రోజులుగా వీధిదీపాలు వెలగడం లేదని సోమవారం బల్దియా ఇంజనీరింగ్ విభాగం అధికారులకు ఫిర్యాదు చేశాం. అయినా అధికారులు స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. అసలే దొంగల భయంతో వణికిపోతున్న ప్రజలు అంధకారంతో కంటిమీద కునుకు లేదని స్థానిక ప్రజలు చెబుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని శ్రీనివాస గుప్తా కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 14న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నగరకాలనీ, హనుమాన్ నగర్, కొత్తూరు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్థికసాయం

మామునూరు : ఖిలావరంగల్ మండలం తిమ్మాపురం శివారు లక్ష్మీపురం చెందిన మంద శ్రీనివాస్ గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న జనతా గ్యారేజ్ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి సుభాకర్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దహన సంస్కారాల నిమిత్తం మృతుడి కుటుంబానికి రూ.12.500ల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో రాజేందర్, లింగాల భోగి, తదితరులు ఉన్నారు.

హిందువులపై దాడులు ఆపాలి



హన్మకొండ చౌరస్తా : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు అమానుషమని తక్షణమే ఆపాలని వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ బాధ్యులు హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని టౌన్‌హాల్ వద్ద ప్లకార్డులు, తెల్లజెండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు ప్రొఫెసర్ సురేశ్ లాల్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో అమాయకపు ప్రజలపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. సొసైటీ బాధ్యుడు మహ్మద్ సిరాజుద్దీన్ మాట్లాడుతు శాంతిని కోరుకునే ప్రతీ ఒక్కరు దాడులను ముక్తకంఠంతో వ్యతిరేకించాలని కోరారు.

విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలి

విద్యారణ్యపురి : దేశభవిష్యత్ విద్యార్థుల చేతిలో ఉందని రాజకీయాల్లోకి రావాలని రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయిలో ఉద్యమాలు నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు రాజకీయాల్లోకి వచ్చి సమాజ అభ్యున్నతికి పాటుపడాలన్నారు. ధన ప్రవాహంలో కొట్టుమిట్టాడుతున్న రాజకీయాలను ప్రక్షాళన చేయాలన్నారు. ఏఐఎస్ఎఫ్ విద్యారంగ సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహిస్తూనే ఉందన్నారు.